ప్రతీ కుటుంబానికి భరోసా

- 'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ లబ్ధి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- పలు ప్రాంతాల్లో ధ్రువపత్రాల పంపిణీ



పీఎం పాలెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతీ కుటుంబానికి భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేములవలసలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో నాయకులు అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు పాలనల్లో తేడాను గమనించాలన్నారు. పేదల పక్షాన నిలిచే వాడే నిజమైన ప్రజా నాయకుడని చెప్పారు.

వేములవలసలో జగనన్న కాలనీలకు త్వరలో శంకుస్థాపన

రాజకీయ విభేదాల వలన వేములవలసలో ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయిందన్నారు. ఆ సమస్యను పరిష్కరించి రూ.80కోట్లు విలువ చేసే స్థలాన్ని పంపిణీ చేసి, తొందరలోనే జగనన్న కాలనీల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం పలు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి వేదికగా మారిందని వివరించారు. ఈ నెల 20 వరకు అవకాశం ఉందని అర్హులైన వారు వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. వేములవలసలో రూ.7.90 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టామని వివరించారు. ఈ సందర్భంగా వేములవలసలో 280 ధ్రువపత్రాలు, పెద్దిపాలెంలో 256 ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సత్య పద్మ, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, తహసీల్దారు లోకవరపు రామారావు, ఎంపీడీవో అడపా లవరాజు, సర్పంచ్‌లు బావిశెట్టి పార్వతమ్మ, కోన పైడిరాజు, లెంక కొండమ్మ, ఎంపీటీసీ సభ్యులు కోరాడ సూర్యకుమారి, మరుపిళ్ల పద్మజ, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు చిరునామా

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం అవంతి ఫంక్షన్ హాలు వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరో వార్డులో ఇప్పటివరకు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల కోసం రూ.100కోట్లు ఖర్చు పెట్టామని చెప్పారు. వార్డులో అభివృద్ధి పనులకు నిధులు అందించి సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. భీమిలి పరిశీలకుడు బాలరాజు, కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, జెడ్పీ కనకమహాలక్ష్మి, తహసీల్దారు రమణయ్య, వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జి మహేష్, 5,6 వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, సీనియర్ నాయకులు గాదె రోశిరెడ్డి, పోతిన ప్రసాద్ యల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల తక్షణ పరిష్కారం

కొమ్మాది: జగనన్న సురక్ష కార్యక్రమంతో సమస్యలు తక్షణమే పరిష్కారం అవుతున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 6వ వార్డు కొమ్మాదిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాజీ మంత్రి, పరిశీలకుడు బాలరాజుతో కలసి ఈయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలు లబ్ధిదారుల చెంతకే వస్తున్నాయన్నారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, వార్డు అధ్యక్షులు బొట్టా అప్పలరాజు, పోతిన హనుమంతరావు, స్థానిక నాయకులు సియాద్రి కనకరాజు, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, రాయని సాయి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అమనాంలో అర్హులకు ధ్రువపత్రాలు అందిస్తున్న సర్పంచ్ ఉమాదేవి, భీమిలి ఎంపీపీ వాసురాజు

అర్హులందరికీ పథకాలు అందాలనే..

తగరపువలస : అర్హులెవరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతోనే జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించి అర్హులకు న్యాయం చేస్తున్నట్లు భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు తెలిపారు. భీమిలి మండలం అమనాంలో సర్పంచ్ దంతులూరి ఉమాదేవి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష క్యాంపులో అర్హులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో భీమిలి ఎంపీడీవో పి.వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ మజ్జి సూరినాయుడు, సీనియర్ నాయకులు పోట్నూరు చంద్రశేఖర్, కేపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాండ్రంగిలో..

పద్మనాభం: పేదవాడి గడపలో కష్టం చూడకూడదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాండ్రంగి, రేవిడిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపుల్లో ఆయన పాల్గొన్నారు. దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీడీవో ఎం.విజయ కుమార్, తహసీల్దార్ టి.శ్రీవల్లి, సర్పంచ్ పల్లి ఝాన్సీ, ఎంపీటీసీ సభ్యులు సీర సూరప్పడు, సిన్నింటి నారాయణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు అముజూరి అప్పారావు, కోన రమణ పాల్గొన్నారు.



పెద్దిపాలెంలో ధ్రువపత్రం అందజేస్తున్న ప్రత్యేకాధికారి సత్యపద్మ

రైస్ కార్డును పునరుద్ధరించారు



నేను చిన్న వ్యాపారం చేసుకుంటూ వేములవలసలో కుటుంబంతో నివసిస్తున్నా. మాకు ఏడాదిన్నర క్రితం వరకూ రైస్ కార్డు ఉండేది. వ్యాపారం కోసం జీఎస్టీ కడుతుంటే ఆదాయ పన్ను కడుతున్నామని రైసు కార్డు నిలిపివేశారు. దీంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి పథకాలను అందుకోలేకపోయాం. ఇటీవల సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదాయపన్ను కడుతున్న అల్పాదాయ వర్గాల వారికి మినహాయింపు ఇవ్వడం మాకు వరంగా మారింది. జగనన్న సురక్షలో మా సమస్యను వివరించగా మరలా మాకు రైస్ కార్డును పునరుద్ధరించారు. దీనివలన వైఎస్సార్ ఆసరా, పింఛను వంటి పథకాలు పొందడానికి అవకాశం ఏర్పడింది.

– తలశిల సీతారత్నం, వేములవలస

మా పిల్లల చదువుకు సర్టిఫికెట్లు ఇచ్చారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల ద్వారా ఆదుకుంటున్నారు. ఇప్పుడేమో కొత్త విద్యా సంవత్సరంలో ఈబీసీ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం మా పిల్లలు తిరగకుండానే ఇంటికి వచ్చి వివరాలు తీసుకుని పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు చేయించి ఇచ్చారు.

– చిల్ల శ్రీదేవి, చిట్టివలస

పిలిచి, ఉచితంగా ధ్రువపత్రాలు ఇస్తున్నారు



నేను మా పిల్లలను చదివించేటప్పుడు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమిలి కార్యాలయాల చుట్టూ పనులు మానుకుని తిరిగేవాడిని. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దూరంగా ఉన్న కార్యాలయాలను సచివాలయాల రూపంలో దగ్గర చేశారు. ఇప్పుడు అక్కడికి కూడా వెళ్లకుండా పిలిచి, ఉచితంగా అవసరమైన ధ్రువపత్రాలు అందిస్తున్నారు.

– సైలాడ మల్లిబాబు, కార్మికవాడ

24 గంటల్లో సర్టిఫికెట్ అందింది



కుల ధ్రువీకరణ పత్రం కోసం కొన్నాళ్లుగా తిరుగున్నాను. కానీ పరిష్కారం కాలేదు. రెండు రోజుల క్రితం జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోగా 24 గంటల్లో నాకు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా ఉంటాయి. ఎంతోమందికి ఉపయోగం.

– జి. రామయమ్మ, కొమ్మాది

పదేళ్లుగా రాని సర్టిఫికెట్ 2 రోజుల్లో వచ్చింది



బర్త్ సర్టిఫికెట్ కోసం 10 సంవత్సరాల నుంచి వివిధ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. అధికారుల చుట్టూ తిరిగాం, కానీ ప్రయోజనం లేదు. అయితే జగనన్న సురక్ష ద్వారా సమస్య పరిష్కారం అవుతుందని వలంటీర్ చెప్పగా నేను దరఖాస్తు చేసుకున్నాను. 48 గంటల్లో సర్టిఫికెట్‌ను మా ఇంటికి తెచ్చి ఇచ్చారు. జగనన్నకు ధన్యవాదాలు.

– ఎ. అప్పలనరసమ్మ, కొమ్మాది కే1 కాలనీ

సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక



2017లో మాకు రెడ్డిక పేరుతో బీసీ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ సర్టిఫికెట్ పొంది ఆరేళ్లవుతోంది. ఆరేళ్ల నుంచి సర్టిఫికెట్ కోసం అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. జగనన్న సురక్ష ద్వారా మాకు మళ్లీ ఇప్పుడు సర్టిఫికెట్ ఇచ్చారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్య రోజుల్లో పరిష్కారమైంది. మాలాంటి వారికి ఇది చక్కని వేదిక.

– పి.లక్ష్మి, కురపల్లి

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆనందపురం : విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఆదివారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సబ్ స్టేషన్ ఏఈఈ సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బోని రోడ్డు లైనులో ఉన్న గ్రామాలకు, ఆనందపురం, లొడగలవానిపాలెం పరిసర ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఏఈఈ సురేష్‌కుమార్ కోరారు.

బాధ్యతలు చేపట్టిన యునాని వైద్యురాలు



విధుల్లో చేరిన వైద్యురాలు ప్రతిభ

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న యునాని వైద్యశాలకు కొత్తగా నియమితులైన వైద్యురాలు బిరుదుల ప్రతిభ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి ఈమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. వైద్యశాలలో సరైన వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో గత ఐదేళ్లుగా మూతపడే ఉంది. ఇప్పుడు వైద్యురాలి నియామకంతో వినియోగంలోకి రానుంది. ప్రస్తుతం ఇందులో ఉన్న మందులన్నీ పాడైపోవడంతో మందులేవీ లేవు. దీని గురించి వైద్యురాలు ప్రతిభ మాట్లాడుతూ కొత్త మందులు పంపాలని అధికారులను కోరానని తెలిపారు. అవి వచ్చిన వెంటనే వైద్యంతోపాటు దీని గురించి అందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ర్యాలీ

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మధురవాడ హైవేపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని పీడీఎస్‌వో విశాఖ జిల్లా కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఆర్‌జేడీ జ్యోతి కుమారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4 వేల మంది విద్యార్థులు రోజూ ట్రాఫిక్ చిక్కులపై హైవే దాటాల్సి వస్తోందని అన్నారు. ఇక్కడ బ్రిడ్జి లేకపోవడం, పోలీసులు గిరి ప్రదక్షిణకు వెళ్లిపోవడం వలన ముగ్గురు విద్యార్థులు ప్రమాదానికి గురయ్యారన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి ఆర్‌జేడీ ఆఫీసు వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఎల్.బాను, పి. విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంగివలస చెరువు కాలువ వివరాల కోసం దరఖాస్తు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస సర్వే నంబర్ 7లో ఉన్న కొండప్ప చెరువు నుంచి సత్యకల్యాణ్, కృష్ణ కల్యాణ్ లే అవుట్ల మీదుగా నిర్మించతలపెట్టిన డ్రైనేజీ వివరాలు కోరుతూ రైతులు, స్థానికులు సమాచారహక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేశారు. ఈ లే అవుట్ల మీదుగా డ్రైనేజీ నిర్మాణాలను వ్యతిరేకించిన వీరు గత నెల 11న స్పందన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జీవీఎంసీ అధికారులు తీసుకున్న చర్యలు తెలియజేయాలని శుక్రవారం దరఖాస్తు చేసినట్టు వారు తెలిపారు.

కాలువల నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు

పద్మనాభం : పాండ్రంగి సచివాలయ పరిధిలో సైడు కాలువల నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరైనట్టు భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. అల్లూరి జయంతి వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన కలెక్టర్ మల్లికార్జున దృష్టికి సర్పంచ్ పల్లి ఝాన్సీ సైడు కాలువల గురించి తెలపగా, వివిధ నిధుల కింద రూ. 52 లక్షలు మంజూరు చేయడానికి హామీ ఇచ్చారన్నారు. వీటిలో రూ. 40 లక్షలు మంజూరు చేశారన్నారు. వీటిలో పంచాయతీ నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ సాధారణ నిధులు రూ.5లక్షలు, జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ నిధులతో సామయ్యవలస, మునివానిపాలెం, ఏనుగులపాలెం, పాండ్రంగి, కురపల్లి, బర్లపేట గ్రామాల్లో సైడు కాలువలు నిర్మిస్తామన్నారు.

పర్యావరణంపై అవగాహనకే పోటీలు



విద్యార్థిని గీసిన చిత్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

మధురవాడ : విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కలిగించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 592 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు జీవీఎంసీ జోన్–2 మధురవాడలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీలను పరిశీలించి చక్కని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఇక్కడ 600 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను జీవీఎంసీ డీఈవో శ్రీనివాసరావు, హైస్కూల్ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

జగనన్న ప్రభుత్వంతో పేదలకు మేలు



మజ్జివలసలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

తగరపువలస: రాష్ట్రంలో పేదలకు మేలు చేసేది సీఎం జగనన్న ప్రభుత్వమేనని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం భీమిలి మండలం మజ్జివలస పంచాయతీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ముందుగా ఆయన కాగితాలపేటలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మజ్జివలసలో రూ.58 లక్షలతో 452 ఇళ్లకు జల్‌జీవన్ మిషన్ పథకానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. ఇప్పటి వరకు సంక్షేమ పథకాల రూపంలో రూ.2 లక్షల కోట్లు రాష్ట్ర ప్రజల ఖాతాలకు జమ చేశారన్నారు. మజ్జివలసలో ఈ నాలుగున్నరేళ్లలో సంక్షేమ, అభివృద్ధి పథకాల కింద రూ.15 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. మొదట్లో అర్హులైన 128 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు తాళ్లవలస పంచాయతీలో మంజూరు చేయగా ప్రస్తుతం వారి సౌలభ్యం కోసం పద్మనాభం మండలం రేవిడికి మార్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ దాట్ల పెదబాబు, స్థానిక సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం



లక్ష్మివానిపాలెంలో కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి, లక్ష్మీప్రియాంక

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులో రూ. 32 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న అభివృద్ధి పనులను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ముందుగా స్థానిక లక్ష్మీవానిపాలెంలో రూ. 19 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని, అనంతరం పీఎం పాలెంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీ అశోక్‌నగర్‌లో రూ. 13.40 లక్షలతో అభివృద్ధి పరిచిన పార్కును ఆయన ప్రారంభించారు.

బీ–2 కాలనీలో శంకుస్థాపన

శంభువానిపాలేనికి వెళ్లే రోడ్డులో గల బి–2 కాలనీలో రూ. 20 లక్షలతో నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ భవనానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో జెడ్పీ కనకమహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ఆరో వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, అధ్యక్షురాలు కె. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రఘు' విద్యార్థుల పునీత్‌సాగర్ అభియాన్

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన పునీత్‌సాగర్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం భీమిలి బీచ్‌లో నిర్వహించారు. ఇందులో భాగంగా పాలిథిన్ వినియోగం వలన కలిగి దుష్ఫలితాల గురించి ప్రచారం నిర్వహించారు. తగరపువలస, భీమిలి ప్రాంతాల్లో పేపర్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ కృష్ణకిషోర్, సంతోషి, నాగమణి, ఢిల్లీశ్వరి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి క్రీడా పరికరాల వితరణ

పద్మనాభం : మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి ఎంపీపీ కంటుబోతు రాంబాబు తన సొంత నిధులతో జారుడు బల్ల, క్రీడా పరికరాలు వితరణగా ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఐబీడీపీ ఫలితాల్లో ఓక్రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ



బి.శ్రితన్, పి.ఆశ్రిత, బి.వర్షిత్

తగరపువలస: అంతర్జాతీయ బాకాలారైట్ డిప్లొమా పరీక్ష (ఐబీడీపీ) 2023 ఫలితాలలో భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ పరీక్షలలో సగటున స్కోర్ 30.2 ఉండగా ఓక్రిడ్జ్ విద్యార్థులు స్కోర్ 32 ఉన్నట్టు స్కూల్ డైరెక్టర్ అమిత్ జైన్ తెలిపారు. తమ స్కూల్‌కు చెందిన బి.శ్రితన్ 45కు గాను 41 పాయింట్లు సాధించగా పి.ఆశ్రిత, బి.వర్షిత్ కూడా అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లలోని విశ్వవిద్యాలయాల పరిధిలో స్కూళ్ల కంటే ఎక్కువ పాయింట్లు సాధించారన్నారు. ఈ సందర్భంగా మంచి స్కోర్ సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల అభినందించారు.

ప్రజా మరుగుదొడ్లకు నీటి సౌకర్యం



గ్రంథాలయ వీధిలో స్థానికులతో మాట్లాడుతున్న భీమిలి జెడ్సీ రాము

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు గ్రంథాలయ వీధిలో రన్నింగ్ వాటర్ లేక పబ్లిక్ టాయిలెట్లు నిరుపయోగంగా, అపరిశుభ్రంగా మారి దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు భీమిలి జెడ్సీ బొడ్డేపల్లి రాము దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఆయన స్పందించి టాయిలెట్లను పరిశీలించారు. వెంటనే రూ.10 వేల నిధులు విడుదల చేసి మోటారుకు మరమ్మతులు చేయించారు. ఇకపై రన్నింగ్ వాటర్ లేదంటూ పని చేయకపోవడం, శుభ్రంగా లేకుండా ఉండకూడదని జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'పీఎంఎఫ్ఎంఈ'తో ఆర్థిక స్వావలంబన



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభారాణి

పద్మనాభం: స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ)ను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌డీఏ పీడీ శోభారాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం పీఎంఎఫ్ఎంఈపై స్వయం సహాయ సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ వ్యాపారాన్ని సమున్నత స్థాయికి తీసుకు వెళ్లడానికి ఈ పథకం సువర్ణావకాశమన్నారు. కార్యక్రమంలో ఏపీఎఫ్‌పీఎస్ ఈడీ ఎం.ఎ.రహమన్, వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ సత్యంనాయుడు పాల్గొన్నారు.

పీఎం పాలెం అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

పీఎం పాలెం : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల తనిఖీల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పీఎం పాలెంలోని యూపీహెచ్‌సీని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రంలో హెచ్ఐఎంఎస్ పోర్టల్ కేంద్ర ఆరోగ్యశాఖ బృందం సభ్యులు డాక్టర్ దేవ్‌ధర్, డాక్టర్ శివశంకర్ పాల్గొన్నారు. హెచ్ఐఎంఎస్ పోర్టల్ సూచనలు ప్రకారం ఆసుపత్రి నిర్వహణ తీరును పరిశీలించారు. ఆసుపత్రి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో మురళి, డాక్టర్ రామిరెడ్డి, డీపీఎంఎ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పద్మనాభం : పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన కె.అక్కులు, పి.శ్రీనివాసరావు, బి.అప్పారావు, జి.త్రివేణి, సమీం మున్నీ షాతో పాటు ఎనిమిది మంది ఉపాధ్యాయులను ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తాలాడ నరసింహనాయుడు, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, హెచ్ఎం ఎ.బాలామణి పాల్గొన్నారు.